ఖమ్మం వ్యవసాయం : ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న రైతులు

ఖమ్మం వ్యవసాయం : ఖమ్మంరూరల్ మండలంలో ఆవరించిన దట్టమైన మేఘాలు

పెనుబల్లి : వడ్లకుప్పలపై పట్టాలు

వేంసూరు : ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన రైతులు

ఉమ్మడి జిల్లాపై 'ఫెంగల్' ఎఫెక్ట్

- తుపాను కారణంగా చల్లబడిన వాతావరణం
- చలి తీవ్రత పెరగడంతో వణుకుతున్న జనం
- కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతుల్లో ఆందోళన

బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుపాను ప్రాభావం ఉమ్మడి జిల్లాపై పడింది. దీంతో రెండు రోజులుగా వాతావరణం చల్లబడింది. ఫలితంగా చలి తీవ్రత పెరగడంతో జనం వణికిపోతున్నారు. మరోవైపు కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోసిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ తుపాను కారణంగా ఇప్పటికే పొరుగు రాష్ట్రమైన ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాని సమీపానే ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాపై దీని ఎఫెక్ట్ మరింత స్పష్టంగా కన్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా దట్టమైన మేఘాలు అలుముకున్నాయి. తెల్లవారింది మొదలు రాత్రి వరకు ఒకే రకమైన వాతావరణం ఉంటోంది. భానుడి జాడ కూడా కన్పించడం లేదు. ఈదురుగాలులు వీస్తుండడంతో పిల్లలు, వృద్ధులు చలికి వణికి పోతున్నారు. అసలే చలికాలం కావడం.. దానికి ఈ తుపాను తోడు కావడం వంటి కారణాలతో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. వర్షాలు కూడా కురిసే అవకాపం ఉండడంతో రైతులందరూ కల్లాల్లోని తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు ధాన్యపు రాశులపై టార్పాలిన్లు కప్పుతున్నారు.

– నమస్తే నెట్‌వర్క్

సమాజం పట్ల బాధ్యతగా పనిచేయాలి

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం, నవంబర్ 30 : సమాజం పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతతో పని చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. ఖమ్మం జిల్లాకు ఎంపికై తొమ్మిదినెలల శిక్షణ పూర్తి చేసుకొని ఖమ్మం కమిషనరేట్‌కు రిపోర్ట్ చేసిన 159మంది సివిల్, ఏఆర్ ట్రైనీ కానిస్టేబుళ్లతో పోలీస్ కమిషనర్ శనివారం సమావేశమయ్యారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవ చేసేందుకు పోలీస్‌శాఖను ఎంచుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌శాఖలో వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ధైర్యంగా, నిజాయితీగా వ్యవహరించాలన్నారు. ప్రధానంగా ప్రజల రక్షణ మన బాధ్యత అని, వారి హక్కులు, ఆత్మగౌరవానికి భగం కలగకుండా ప్రజా సంబంధాలు మెరుగుపరుచుకోవాలన్నారు. నిత్యం పని ఒత్తిడి, ప్రతికూల పరిస్థితుల్లో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిబద్ధతతో విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏసీపీ సాంబరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్

మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లి, నవంబర్ 30: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా 6వ అదనపు జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీవాణి బాలికల కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకుంటూనే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చట్టాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు సాధించి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ మీరాఖాసీం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆయేషాషరీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడమ్స్, ఏసీపీ ఎ.రఘు, న్యాయవాదులు విజయ్, వెంకట్రావు, రజిని పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆధునిక సిలబస్‌తో విద్యాబోధన

ఐసీడీఎస్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి

సత్తుపల్లి, నవంబర్ 30: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో ఆధునిక సిలబస్‌తో రూపొందించిన విద్యాబోధన నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ సీ.హెచ్.ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. కల్లూరు ప్రాజెక్టు సీడీపీవో నిర్మలాజ్యోతి ఆధ్వర్యంలో కల్లూరు పట్టణంలోని 10, 12, ఖాన్‌ఖాన్‌పేట 2లో అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, పేరువంచ సెక్టార్ సూపర్‌వైజర్ భవానీ పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్లు రూపొందించిన కార్నర్స్‌ను ఆమె పరిశీలించారు. చిన్నారులతో సరదాగా గడిపారు. ప్రీ స్కూల్ విద్యాబోధన, కర్నార్స్, రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2023-24 విద్యాసంవత్సరం నుంచి నవీకరించిన పూర్వ ప్రాథమిక విద్య సిలబస్‌తో రూపొందించిన ఆధునిక విద్యాబోధన జరుగుతుందని, ప్రైవేటు పాఠశాలలకు dwటుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మన సంస్కృతిక, సంప్రదాయాలు, ఆరోగ్య సూత్రాలు తెలియజేసే విధంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీచర్లు సావిత్రి, రాజకుమారి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయాన్ని పాటించాలి

డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

మధిర, నవంబర్ 30: వైద్య సిబ్బంది సమయాన్ని పాటించాలి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. ఆమె శనివారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి స్టాక్ పొజిషన్, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో రోగులను అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 2 నుంచి 15 వరకు జరిగే ఎల్‌సీడీపీ లెప్రసీ కార్యక్రమానికి ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా అధికారి రామారావు, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ దుర్గా పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీటీ చాంపియన్‌షిప్ పోటీలు

ఖమ్మం సిటీ, నవంబర్ 30 : ఉమ్మడి ఖమ్మంజిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శనివారం నగరంలోని పటేల్ స్టేడియంలో ఉత్సాహంగా సాగాయి. నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా యువజన, క్రీడల అధికారి టీ సునీల్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ క్రీడకు అవసరమైన వసతులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల దిశగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రముఖ పిల్లల వైద్యనిపుణుడు, టీటీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్, బాలసాని విజయ్‌కుమార్, క్రీడా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మొదటిరోజు విజేతలు : బాలసాని హారిక(ఖమ్మం), డోగిపర్తి సాన్వి(ఖమ్మం), రోజా(పాల్వంచ), హోప్స్ నందు డోగిపర్తి సాన్వీ(విన్నర్), బాలసాని తన్మయ్(రన్నర్)లుగా నిలిచారు. మూడోస్థానంలో ఆరాధ్య, నాల్గవ స్థానంలో రక్ష నిలిచారు. విజేతలకు బాలసాని విజయ్‌కుమార్, కోచ్ సాంబమూర్తి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

వాగ్దానాలు అమలు చేయకుండా సంబురాలా?

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్, నవంబర్ 30: ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజాపాలన పేరుతో సంబురాలు చేసుకోవడం ఏమిటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రశ్నించారు. శనివారం సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ తప్ప.. ఏ పథకం సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. మంత్రి తుమ్మల మాటలను బట్టి చూస్తే రైతుభరోసాకు ఎగనామం పెట్టేలా ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు. సమావేశంలో శీలం సత్యనారాయణరెడ్డి, మాదినేని రమేష్, మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి

ఎర్రుపాలెం, నవంబర్ 30: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల కోసం ఎన్నో ఉత్తర్వులు సాధించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సంఘం పీఆర్‌టీయూ మాత్రమే అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జమలాపురంలో శనివారం ఎర్రుపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న దండెం సత్యనారాయణరెడ్డి పదవీ విరమణ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనంతరం బాలాజీ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గం నుంచి పీఆర్‌టీయూ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి కోరామన్నారు. బిల్లుల విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తే ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. వై.వెంకటేశ్వరరావు, రామిశెట్టి రంగారావు, జంగా గురునాథ రెడ్డి, మదన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వ చెలగాటం

పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌పై వామపక్ష విద్యార్థి సంఘాల ఆగ్రహం

వైరాటౌన్, నవంబర్ 30: విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన ప్రభుత్వ పాఠశాలలు బంద్‌కు సంఘీభావంగా వైరాలో జార్జిరెడ్డి పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందా సురేష్, భూక్యా ప్రభుదేవా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ.. ప్రభుత్వ, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో భోజనం జైల్లో ఖైదీల కన్నా ఘోరంగా మెస్ బిల్లులు అని ప్రశ్నించారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేనియెడల వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొక్క సురేష్, అజయ్, శీకిల్, రోహిత్, సతీష్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై సర్వే : వైద్యాధికారి

ముదిగొండ, నవంబర్ 30: కుష్టు వ్యాది నిర్మూలనపై సర్వే నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి అరుణాదేవి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కుష్టు వ్యాధి నిర్మూలన సర్వేపై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిసెంబర్ రెండు నుంచి 15 వరకూ ఆశా కార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఎంపీవో వాల్మీకి కిశోర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెలకు 40 హెచ్ఐవీ కేసులు!

జిల్లాలో 6,732 మంది నమోదు
పెద్దాసుపత్రిలో ఉచితంగా మందులు
నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

ఖమ్మం సిటీ, నవంబర్ 30: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ.. ప్రభుత్వాలు ఎన్ని రకాలుగా ప్రచారాలు చేస్తున్నప్పటికీ.. ఖమ్మం జిల్లాలో ప్రతి నెలా కొత్తగా 40 మంది హెచ్ఐవీ భారిన పడుతున్నారు. వారిలో ఇద్దరు గర్భిణులు ఉండడం గమనార్హం. డిసెంబర్ 1న ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. హైరిస్క్ కలిగిన కేసులు దాదాపు 2,595 కాగా వాటిల్లో ఫిమేల్ సెక్స్ వర్కర్స్ 1,788, స్వలింగ సంపర్కులు 727, ట్రాన్స్‌జెండర్స్ 80 మంది ఉన్నరు. జిల్లావ్యాప్తంగా 6,732 మందికి హెచ్ఐవీ సోకగా బాధితులందరికీ జిల్లా సార్వజనీన ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రం నుంచి ఉచితంగా మందులు అందిస్తున్నారు. వ్యాధిగ్రస్తుల్లో 2,584 మంది ఏఆర్‌టీ ఆసరా పింఛన్ పొందుతున్నారు. జాగృతి, జనవాణి స్వచ్ఛంద సంస్థలు ఎయిడ్స్, హెచ్ఐవీ బాధితుల కోసం పని చేస్తున్నాయి. వైఆర్‌జీ కేర్ లింకు వర్కర్స్ స్కీమ్ గ్రామీణ ప్రాంతాల్లోని హైరిస్క్ ప్రవర్తన కలిగిన వ్యక్తుల కోసం పనిచేస్తున్నది. జిల్లాలో ఐసీటీసీ కేంద్రాలు-4, ఎఫ్ఐటీసీ కేంద్రాలు-38, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు 161, బస్తీ దవాఖానాలు 9, ఏఆర్‌టీ కేంద్రం 1, లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు 2, రక్తనిధి కేంద్రాలు 10 హెచ్ఐవీ నివారణ కోసం నిరంతరం శ్రమిస్తున్నాయి. కాగా.. నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వనంలో సందడే సందడి

కొణిజర్లలో..

బోనకల్లులో..

ఖమ్మంరూరల్‌లో..

ఎర్రుపాలెం, నవంబర్ 30: మండలంలోని జమలాపురం గ్రామ సమీపంలోని మామిడితోటలో బంజర యాదవసంఘం ఆధ్వర్యంలో శనివారం వనసమారాధన నిర్వహించారు. ఈ వేడుకలో సంఘం జిల్లా నాయకులు చిత్తారు సింహాద్రియాదవ్, మాజీ సర్పంచ్ మొగిలి అప్పారావుయాదవ్, విజయలక్ష్మీని సన్మానించారు.

కొణిజర్ల, నవంబర్ 30: కార్తీకవన సమారాధనలో భాగంగా కొణిజర్ల సూపర్ జేమ్స్ విద్యార్థులు మండలంలోని బొట్లకుంట గ్రామంలోని మామిడితోటలో సందడి చేశారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు.

బోనకల్లు, నవంబర్ 30: మండలంలోని రాయన్నపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వనభోజన కార్యక్రమం బత్తినేని చారిటబుల్ ట్రస్టు సహకారంతో శనివారం ఘనంగా నిర్వహించారు.

పెనుబల్లి, నవంబర్ 30: మండల పరిధిలోని తాళ్లపెంటలో కులాలకు అతీతంగా అన్నివర్గాల వారు నరసింహాచెరువు కట్టపై వెలిసిన కొంకరికొండ నరసింహస్వామి ఆలయం వద్ద వనభోజనాలు చేశారు.

ఖమ్మం రూరల్, నవంబర్ 30: మండలంలోని హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ విద్యార్థులు శనివారం కొణిజర్ల మండలం కొదుమూరు మామిడి తోటలో వన విహారానికి వెళ్లారు. ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రొగ్రెసివ్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఆర్.పార్వతిరెడ్డి, హెచ్ఎం రవిశంకర్, ప్రైమరీ హెచ్ఎం ఎం.ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం, నవంబర్ 30 : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక, సామాజిక సంఘాల భాగస్వామ్యంతో ఆదివారం నిర్వహించే సకల జనుల భోజనాలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని బల్లెపల్లిలో గల మలీదు జగన్ మామిడితోటలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన వెంట పుల్లయ్య, శిరోమణి, ఝాన్సీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 30 : కార్తీక బహుళ అమావాస్యను పురస్కరించుకొని స్తంభాద్రి సేవాసమితి ఆధ్వర్యంలో గోశాలకు దాణా వితరణ చేశారు. సేవాసమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రూ.62 వేల విలువైన గోదాణాను గొల్లగూడెంలోని ఓం గోశాలకు వితరణ చేశారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం

ఖమ్మం, నవంబర్ 30 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డు రామాచారికి ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు రూ.30 వేల సాయాన్ని ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఇంటి వద్ద చికిత్స పొందుతున్న హోంగార్డును కలిసి పరామర్శించారు.

కమనీయ రూపం.. కార్తీక దీపం

రఘునాథపాలెం, నవంబర్ 30 : కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకొని శనివారం ఖమ్మం నగరం పాండురంగాపురంలోని శ్రీరామలింగేశ్వర ఆలయం దేదీప్యమానంగా వెలుగొందింది. లక్షదీపాల వెలుగులతో శోభాయమానంగా దర్శనమిచ్చింది. ఓంకారం, శివలింగం, త్రిశూలం, శ్రీరామ ఆకృతుల్లో ప్రమిదలను వెలిగించారు.

'మత్తు పదార్థాల బారిన పడొద్దు'

రఘునాథపాలెం, నవంబర్ 30 : మత్తు పదార్థాల బారినపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ సూచించారు. రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో రఘునాథపాలెం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహాసభను విజయవంతం చేయాలి

మధిర, నవంబర్ 30: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మధిర మండల 11వ మహాసభను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ, మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వినోదరావు, వీరయ్య, బండారు నాగరాజులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

ప్రీస్కూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

సత్తుపల్లిటౌన్, నవంబర్ 30: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐసీడీఎస్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ సీ.హెచ్.ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. సత్తుపల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
BUSINESS OFFER
★బియ్యం, ధాన్యం, వడ్లు టన్నులు టన్నులు కొంటాం. మాది అతి పెద్ద రైస్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్. ధాన్యం, రైస్ వ్యాపారస్తులు & ఆల్ ఫుడ్ ఐటమ్స్ అమ్మేవారు, రైస్ మిల్లర్లు, మీడియేటర్స్, ఈ బిజినెస్‌లో పెట్టుబడి పెట్టే పార్టనర్స్ డైరెక్ట్: 8008251356.
NT-339341-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్లు ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోలీస్ అధికారులకు ఘన సన్మానం

ఖమ్మం,నవంబర్ 30 : ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ రిటైర్‌మెంట్ వృత్తికే నని, వ్యక్తిత్వానికి కాదని అన్నారు. శేషజీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్.నాగేశ్వరరావు, పి.క్రిష్ణయ్య, సూర్యారావు ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ జానీమియా, పంతులు పాల్గొన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణుల వనసమారాధన

రఘునాథపాలెం, నవంబర్ 30 : ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని పొదిల వెంకటేశ్వర్లు మామిడితోటలో ఖమ్మం నగర విశ్వబ్రాహ్మణ వనసమారాధన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు విశ్వకర్మ వనసమారాధన కమిటీ బాధ్యులు పెంథోట సోమేశ్వరాచారి శనివారం ప్రకటనలో తెలిపారు. నగరంలోని విశ్వబ్రాహ్మణులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

రఘునాథపాలెం, నవంబర్ 30 : అధికారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు విలేకరులపై రఘునాథపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన ప్రకారం.. ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నారి విజయలక్ష్మి శనివారం కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా ఆదాబ్ ఇండియా రిపోర్టర్ వెంకటేశ్వర్లు, ఎన్6 న్యూస్ రిపోర్టర్‌లు వచ్చి యాడ్ పేరుతో డబ్బులు డిమాండ్ చేశారు. అధికారి నిరాకరించడంతో ఘర్షణ పడి విధులకు ఆటంకం కలిగించారు. అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చర్చి ప్రారంభం

కూసుమంచి, నవంబర్ 30: మండలంలోని జుర్రుల్‌రావుపేటలో చర్చిని ఖమ్మం మేత్రాసనం ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ శనివారం ప్రారంభించారు. ప్రావిన్సెస్, అమృతరాజ్, పాలేరు చర్చి ఫాదర్ ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం

ఖమ్మం రూరల్, నవంబర్ 30: మండలంలోని గుదిమళ్ల గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం, అవగాహన సదస్సు జరిగాయి. తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీవో ఎస్.కుమార్, ఎంఈవో శ్రీనివాస్, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ పరిశీలన

కూసుమంచి, నవంబర్ 30: మండలంలో కుల గణన సర్వే డేటా ఎంట్రీ శనివారం నాటికి 63 శాతం పూర్తయింది. మొత్తం 21,729 ఇండ్లలో సిబ్బంది సర్వే చేశారు. కూసుమంచిలో కుల గణన డేటా ఎంట్రీని ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి శనివారం పరిశీలించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

కూసుమంచి, నవంబర్ 30: కాలువలో జారి పడిన వ్యక్తి మృతిచెందాడు. నేలకొండపల్లి మండలం భైరవునిపల్లికి చెందిన గుడివాడ ఉపేందర్(35), కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం కాలువలో ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి గల్లంతయ్యాడు. మత్స్యకారులకు మృతదేహం కనిపించింది. వారు ఇచ్చిన సమాచారంతో కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మం,నవంబర్ 30 : ఖమ్మం నగరంలోని బుర్హన్‌పురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11/కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో ఉన్న రవీంద్రనాథ్‌ఠాగూర్ రోడ్డు పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగ